# వరంగల్ వాయిస్
Evening Daily


సంపుటి : 04 | సంచిక : 363
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
నవంబర్ 27, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## కమలాపూర్‌లో తొలి నామినేషన్



- బీజేపీ అభ్యర్థి పబ్బు సతీష్ దాఖలు

8లో..




- ప్రభుత్వ ఖర్చుల వివరాలు ఇంటర్నెట్‌లో ఉంచాలి
- సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం
- పిల్ దాఖలు చేసిన వరంగల్ వాసి, సామాజిక వేత్త అందె రఘు
- ఆర్టికల్ 32 కింద పిటిషన్
- త్వరలో విచారణ



ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్న నిధుల వివరాలను స్వచ్ఛందంగా ఇంటర్నెట్‌లో పొందుపరచాలని కోరుతూ ప్రముఖ సామాజిక కార్యకర్త, వరంగల్ వాసి అందె రఘు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వ కార్యకలాపాల్లో జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఈ పిల్ ప్రధాన లక్ష్యమని రఘు వెల్లడించారు. ఇది ప్రజాధనం. ఖర్చుల వివరాలు ఇంటర్నెట్‌లో ఉంచడంద్వారా ప్రతి రూపాయి ప్రభుత్వం ఎందుకు ఖర్చు చేస్తుందో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందన్నారు. దీనివల్ల ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పారదర్శకత పెరుగుతుందని, అవినీతి తగ్గుతుందన్నారు. దేశంలో వివిధ పథకాల కోసం ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయిస్తుంది.. వాటిని ఎలా ఖర్చు చేస్తుంది అనే వివరాలను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమాచారం కోసం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వమే స్వచ్ఛందంగా ఈ వివరాలను ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. సుప్రీం కోర్టులో అక్టోబర్ 14, 2025న దాఖలైన ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది. అయితే పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి




2లో..

- సాధారణ పరిశీలకులు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయ దేవి
- కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం

## నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్క్ లను తనిఖీ
- పలు కేంద్రాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన



8లో..




# ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- సాధారణ పరిశీలకులు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయ దేవి
- కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, పగడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉందని గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయ దేవి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ అంకిత్ కుమార్, వ్యయ పరిశీలకులు సునాయన చౌహాన్, ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ఎన్నికల పరిశీలకులు బాల మాయ దేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోడల్ అధికారులు, పోలీసులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలన్నారు. ప్రజలు అందరూ తమ ఓటుహక్కును ఉపయోగించుకొనే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. నిబంధనల మేరకు అభ్యర్థుల ఖర్చు వివరాలను ప్రతి పైసా లెక్కించాలన్నారు. అధికారులు అప్రమత్తతతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా కట్టుదిట్టమైన వ్యవస్థ అమలు చేయాలన్నారు. ప్రత్యేకంగా ఎఫ్ఎస్‌టీ (ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్), ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్విలెన్స్ టీమ్) బృందాలు నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ఓటర్లను ఆకర్షించే డబ్బు, మద్యం, బహుమతులు, ఇతర వస్తువుల పంపిణీపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయలన్నారు. ఎన్నికలు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా, భయరహిత వాతావరణంలో జరుగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతీ ప్రక్రియ కూడా నిబంధనల ప్రకారం, బాధ్యతాయుతంగా అమలు చేయాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు బాల మాయ దేవి, వ్యయ పరిశీలకులు సునాయన చౌహాన్ లకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లాలో మూడు దశల్లో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్ల పూర్తి వివరాలు అందించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, రవాణా, జోన్లు, రూట్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు, ప్రహరీ, సిబ్బంది వంటి అన్ని అంశాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలు పూర్తిస్థాయి పారదర్శకతతో జరగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వెల్లడించారు. డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకుంటున్న చర్యలు, సమస్యాత్మక ప్రాంతాల్లో చేపడుతున్న చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ గురించి వివరించారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఓ కల్పన, జిల్లా నోడల్ అధికారులు, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.



## పనుల్లో వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- వడ్డేపల్లి బండ్ పై క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని ప్రశాంత్ నగర్ లో గల ఎస్ టి పి,వడ్డేపల్లి బండ్, కరీమాబాద్ శాంతి నగర్ స్మశానవాటిక తో పాటు శ్యాయం పేట ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ హనుమకొండ ప్రశాంత్ నగర్ లో 15 ఎమ్ఎల్ డీ, ఎస్ టీపీని క్షేత్ర స్థాయిలో సందర్శించి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించి పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని కాంట్రాక్టర్ కు నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బండ్ పై కొనసాగుతున్న సైకిల్ ట్రాక్ పనులు, మీడియన్ లో బ్యాక్ ఫిల్లింగ్, లాండ్ స్కేప్ డిజైన్, రిటైనింగ్ వాల్, హార్టికల్చర్ విభాగం వారు కొన్ని ప్రతిపాదనలు అందించిన నేపథ్యంలో ఆయా డిజైన్ ల గురించి అడిగి తెలుసుకొని ఆమోదించిన కమిషనర్ బండ్ పై అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిసెంబర్ లోగా స్మార్ట్ సిటీ గడువు ముగుస్తున్నందున అప్పటిలోగా ఈ పనులన్నీ పూర్తి చేయాలని కమిషనర్ అన్నారు. అనంతరం వరంగల్ పరిధి కరీమాబాద్ శాంతినగర్ ప్రాంతంలో గల గ్రేవ్ యార్డ్ లో నిర్మించిన సీసీ రోడ్డు టాయిలెట్స్, బర్నింగ్ ప్లాట్ ఫాంను కమిషనర్ పరిశీలించారు. అంతకు ముందు శాయంపేట టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతంలో అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి మీడియన్ లో స్క్వేర్ మీటర్ కు ఎన్ని మొక్కలు నాటారో కొలతలు వేసి పరిశీలించారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు

- రైతుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్





**వరంగల్ వాయిస్, శాయంపేట :** ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఎన్ని క్వింటాలో దాన్యం ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుంది, ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు, ఈరోజు ఎంత ధాన్యాన్ని కాంటాలు వేశారు, ఎన్ని టోకెన్లు ఇచ్చారు, రోజుకు మిల్లులకు ఎంత ధాన్యం వెళ్తుంది, రైతుల వివరాలను ట్యాబ్ లో ఎందుకు నమోదు చేయడం లేదని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల కోసం టెంట్, తాగునీరు సదుపాయాలు కల్పించాలి కదా ఎందుకు కలిపించలేదని నిర్వాహకులను కలెక్టర్ ప్రశ్నించారు. ఆరు రోజుల నుండి ట్యాబ్ పనిచేయకపోతే ఎందుకు బాగు చేయించలేదని కలెక్టర్ అడిగారు. రైతులకు డబ్బులు ఖాతాలో పడాలంటే ట్యాబ్ ఎంట్రీ చేయాలి. ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇన్ని రోజుల నుండి ట్యాబ్ ఎంట్రీ చేయకపోతే రైతులు ఎందుకు అడగడం లేదని అక్కడే ఉన్న పలువురు రైతులను కలెక్టర్ అడిగారు. అక్కడే ఉన్న రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, ట్యాబ్ ఎంట్రీ చేయడంలో జరిగిన నిర్లక్ష్యంపై ఏపీఎం, కొనుగోలు కేంద్రం ఇన్చార్జికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రైతుల వివరాలను నమోదు చేసే ట్యాబ్ ను వెంటనే బాగు చేయించుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే ఎంట్రీ చేయాలని పేర్కొన్నారు. దాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరిగే విధంగా ఎంపీడీవో, ఏపీఎం కొనుగోలు చేసిన వద్ద ఉండి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టెంటు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ ప్రవీన్ కుమార్, ఎంపీడీవో ఫణి చంద్ర, ఏపీఎం వేణు, తదితరులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## తుపాకులు అప్పగించండి

- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. నెలవారి నేర సమీక్షా సమావేశంలో భాగంగా గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత కమిషనరేట్ పరిధిలో త్వరలో మూడు విడతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో పోలీసులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సీపీ అధికారులతో చర్చించారు. పోలీస్ స్టేషన్ వారిగా ఎన్నికలు జరిగే గ్రామ పంచాయితీల వివరాలతో పాటు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాల వివరాలను పోలీస్ కమిషనర్ సంబంధించిన స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ప్రణాళికబద్ధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ మొదలుకొని ఎన్నికలు ముగిసే వరకు పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సరైన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన వారితోపాటు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాలను పోలీస్ అధికారులు నిరంతరం సందర్శిస్తూ ఎన్నికలను సజావుగా కొనసాగేందుకుగా స్థానిక గ్రామస్తులతో సమన్వయం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఇతర జిల్లాల నుంచి బందోబస్తు విధులు నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది రావడం ఉండదన్నారు. కావున ప్రస్తుతం అందుబాటులో ఉన్న పోలీస్ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని లైసెన్స్ కలిగిన అయుధ యజమానులు తమ తుపాకులను సమీప పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేసే విధంగా స్టేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. అనంతరం పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, నేరాల నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలు మొదలైన అంశాలపై పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, ఏఎస్పీలు శుభం, చైతన్య, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, బాలస్వామి, సురేశ్‌కుమార్, శ్రీనివాస్‌తో పాటు ఏసీపీలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

◆ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన మాజీ సర్పంచులు



**వరంగల్ వాయిస్, నడికూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సర్పంచుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా అనేక మంది సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరిన్ని ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్రావు ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ కి తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ వినతి పత్రం అందజేశారు. సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ, తాము ఆరు నెలల కిందట మానవ హక్కుల కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆ ఫిర్యాదుపై గురువారం విచారణ ఉండడంతో సర్పంచులు హాజరు అయినప్పటికీ, పంచాయతీరాజ్ అధికారులు నాలుగు వాయిదాలకు కూడా హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ సర్పంచుల పెండింగ్ బిల్లుల విషయంలో స్పందించకపోవడం ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామని అన్నారు. మాజీ సర్పంచులపై ఖర్చుల కోసం ఒత్తిడి తేవడం తగదని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో, ఫిబ్రవరి 2, 2026 నాడు చివరి అవకాశం ఇస్తూ పంచాయతీరాజ్ అధికారులకు నోటీసు ద్వారా తెలియజేశామని రవీందర్రావు తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు తక్షణమే ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షులు కేశ బోయిన మల్లయ్య, సముద్రాల రమేష్, నడికూడ రవీందర్రావు, వెంకటరామిరెడ్డి, పాండురంగారెడ్డి, బస్మాపురం సప్న, అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

# 'అగ్రవర్ణ దురహంకారం తగదు'



• మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పద్మశాలీల ఆగ్రహం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేతపై చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రంలోని పద్మశాలి సమాజం తీవ్రస్థాయిలో మండిపడుతోంది. గురువారం మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను హనుమకొండ పట్టణంలో తెలంగాణ ప్రాంత అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి తీరు అగ్రవర్ణ దురహంకారానికి నిదర్శనమని పద్మశాలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా పదవి చేపట్టిన నేపథ్యంలో పున్న కైలాష్ నేత మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల మంత్రి కోమటిరెడ్డి ఇంటికి మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు. అయితే, మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "నాపై, నా కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా మాట్లాడినవు, నన్ను కలిసేది లేదు" అంటూ కైలాష్ నేతను తిరస్కరించారు. ఉప ఎన్నికల నాటి వ్యాఖ్యలను వక్రీకరించారని కైలాష్ నేత వివరించినప్పటికీ, మంత్రి వినకుండా పుష్పగుచ్చం కూడా తీసుకోకుండా నిరాకరించారు. కొంతసేపు వేచి చూసినా మంత్రి సమయం ఇవ్వకపోవడంతో, డీసీసీ అధ్యక్షులు కైలాష్ నేత నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరించిన తీరు అగ్రవర్ణ దురహంకార పోకడకు నిదర్శనమని పద్మశాలి సమాజం నాయకులు పేర్కొన్నారు. బీసీ వర్గం నుంచి రాజకీయంగా ఎదుగుతున్న పద్మశాలిలకు కాంగ్రెస్ పార్టీ నుండి లభించిన ఒకే ఒక డీసీసీ పదవిని జీర్ణించుకోలేక, రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తికి పదవి రాలేదన్న అక్కసుతోనే మంత్రి ఈ విధంగా అవమానించారని ఆరోపించారు. ఇది కేవలం కైలాష్ నేతను అవమానించడం కాదని, రాష్ట్రంలోని పద్మశాలి కులాన్ని మంత్రి కోమటిరెడ్డి అవమానించినట్టుగా పరిగణించారు. అగ్రవర్ణ పోకడకు పోతున్న మంత్రి కోమటిరెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలని పద్మశాలీలు డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుండి తొలగించాలని కోరుతూ సీఎంకు లేఖ రాసినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే, రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలి సమాజం ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. మంత్రి కోమటిరెడ్డికి పద్మశాలి తడాఖా ఏంటో చూపుతామని రాష్ట్రంలోని పద్మశాలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో, తెలంగాణ ప్రాంత అఖిల భారత పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. పున్న కైలాష్ నేతకు పద్మశాలి సమాజం అండగా నిలుస్తుందని ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు గైని సత్యనారాయణ, కామిని మల్లేష్, గంజి లక్ష్మణ్, మార్గం శ్రీనివాస్, చింతకింది నరహరి తదితర జిల్లా పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలి




**వరంగల్ వాయిస్, పరకాల:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించేందుకు ప్రతి గ్రామంలో కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జ్ మేకల రాజావీరు పిలుపునిచ్చారు. గురువారం పరకాల టౌన్ ఆఫీస్‌లో పరకాల రూరల్ మండలానికి సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశం పరకాల మండల అధ్యక్షులు కాస గాని రాజ్ కుమార్ గారి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేకల రాజావీరు గారు, ప్రతి గ్రామంలోనూ బీజేపీ అభ్యర్థులు సర్పంచ్‌గా గెలుపొందడం కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పసుల భిక్షపతి, కొమ్మిడి మహేందర్ రెడ్డి, బాబు యాదవ్, పుట్ట రవీందర్, ఏ.సురేష్, దయ్యాల దేవరాజ్ పాల్గొన్నారు. అలాగే, మండల ప్రధాన కార్యదర్శులు గుండెబోయిన నర్సయ్య, జంగిలి రాజేందర్ రావు; మండల ఉపాధ్యక్షులు ఎస్. భాస్కర్, డి. పద్మ, సంతోష్ రావు; కార్యదర్శి పి.మల్లారెడ్డితో పాటు, నాయకులు వీరాస్వామి, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, కుమారస్వామి, సదయ్య, వెంకటేశ్వర్లు, రాకేష్, రాజేష్, ఓదెలు, కొమురయ్య, రాంబాబు, సంపత్, భగత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆహారం, వ్యాయామంతో మధుమేహాన్ని జయించవచ్చు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల ద్వారా మధుమేహాన్ని (డయాబెటిస్‌ను) సమర్థవంతంగా అదుపులో ఉంచుకోవచ్చని సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ అన్నారు. గురువారం మందిర ప్రాంగణంలో డయాబెటిస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ, అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో మధుమేహం ఒక సాధారణ సమస్యగా మారిందని, అయితే క్రమం తప్పకుండా తీసుకునే వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం ద్వారా దీన్ని నియంత్రించవచ్చని భక్తులకు సూచించారు. మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయడం ద్వారా చక్కెర వ్యాధిని అదుపులో ఉంచుకొని ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న సిబ్బంది వైష్ణవి, శివ, భాను, చిట్టి బాబు భక్తులకు రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాధి నియంత్రణకు పాటించాల్సిన తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

బాసాని బాలకృష్ణ డిమాండ్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్థానిక సంస్థలతో పాటు చేనేత సహకార సంఘాలకు కూడా వెంటనే ఎన్నికలు నిర్వహించాలని అఖిలభారత పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి బాసాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శాయంపేటలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇంచార్జి పాలకవర్గాలను కొనసాగించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. చేనేత సంఘానికి ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఆయన కోరారు. ఈ విషయంలో అధికారులకు విన్నవించుకోగా, అప్పటి పాలకవర్గం రాజీనామాను ఆమోదించి, సంఘానికి స్పెషల్ ఆఫీసర్ను నియమించడం జరిగిందని తెలిపారు. తక్షణమే చేనేత సొసైటీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటే చేనేత సహకార సంఘాలకు కూడా ఎన్నికలు నిర్వహించి, కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని బాలకృష్ణ కోరారు.

# ఎరువులు, విత్తన షాపుల్లో తనిఖీలు



**వరంగల్ వాయిస్, పరకాల:** డివిజన్ పరిధిలోని విత్తన,యు ఎరువుల దుకాణాలపై గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరకాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) శ్రీ కొనిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. తనిఖీ సందర్భంగా డీలర్ల రికార్డులను పరిశీలించిన అధికారులు, డీలర్లందరూ తప్పనిసరిగా రికార్డులు సరిగా నిర్వహించాలని ఆదేశించారు. రికార్డులలో లోపాలు ఉన్నా లేదా నిబంధనలు పాటించకపోయినా, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. అదేవిధంగా, రైతులందరికీ ముఖ్యమైన సూచన చేశారు. రైతులందరూ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు (బిల్లు) తీసుకోవాలని, దీనివల్ల నాణ్యత విషయంలో సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించడం సులభమవుతుందని సూచించారు. ఈ తనిఖీలో ఏడీఏతో పాటు మండల వ్యవసాయ అధికారి (ఏవో), ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'వృద్ధ సమాజాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుకుందాం'

## డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని వృద్ధ సమాజాన్ని మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రకాశ్ ఆరోగ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వరంగల్ లో గురువారం "వృద్ధుల మానసిక ఆరోగ్యముపై జాగ్రత్తలు" అనే అంశంపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, ఇతర ఆరోగ్య సిబ్బందికి వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వరంగల్ మరియు హెల్ప్ ఏజ్ ఇండియా హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ క్లస్టర్, గ్రామ స్థాయిలో ఉండే వృద్ధులలో మానసిక వ్యాధులను గుర్తించాలని అన్నారు. ఎప్పటికప్పుడు మందులు, జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని, తద్వారా ఆరోగ్యవంతమైన వృద్ధ సమాజాన్ని తయారు చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. వరంగల్ నగర ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ శ్రీధర్ రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్య కార్యకర్తలకు వృద్ధుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. ముఖ్యంగా వృద్ధులు నిత్య జీవితంలో ఎదుర్కొనే సాధారణ మానసిక సమస్యలైన కుంగుబాటు (డిప్రెషన్), చిత్తవైకల్యం (డిమెన్షియా – జ్ఞాపకశక్తిని కోల్పోయే వ్యాధి) వంటివి రాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ, తగిన జాగ్రత్తలు, మందులు వాడుకునేలా వృద్ధులకు, వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తూ పనిచేయాలని కోరారు. డిప్యూటీ డెమో అనిల్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులు సమాజ సంపద అని కొనియాడారు. వారికి నిత్యం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, వారి ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. హెల్ప్ ఏజ్ ఇండియా కోఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో "వృద్ధుల మానసిక ఆరోగ్యముపై తగు జాగ్రత్తలు" అనే అంశంపై వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 40మంది ఆశా వర్కర్స్, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పీలు (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్) పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి కార్యక్రమ అధ్యక్షులుగా వ్యవహరించగా, జాయింట్ సెక్రటరీ ఏ.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

# 'రాజ్యాంగమే దేశంలో అత్యున్నత చట్టం'

## ◆ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి పట్టాభి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాజ్యాంగం దేశంలో అత్యున్నత చట్టమని, ప్రతి పౌరుడు రాజ్యాంగానికి కట్టుబడి ఉండి, దాని ఆదర్శాలను కొనసాగించాలని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభి రామారావు పిలుపునిచ్చారు. నవంబర్ 26న "భారత రాజ్యాంగ దినోత్సవం" సందర్భంగా, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో, "కొండూరు సరస్వతి మార్కండేయ (కేఎస్ఎం) ఫౌండేషన్" సహకారంతో సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో మూట్ కోర్ట్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాతలు అనేక చట్టాలను, రాజ్యాంగాలను అధ్యయనం చేసి, మన దేశానికి అనుగుణమైన రాజ్యాంగాన్ని రూపొందించారని ఆయన కొనియాడారు.రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, రాజ్యాంగ స్ఫూర్తిని, ఆదర్శాలను కొనసాగించాలని ఆయన ప్రసంగించారు. మరో ముఖ్య అతిథి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అనుభవించడంతో పాటు, ప్రాథమిక విధులను కూడా తప్పనిసరిగా పాటించినప్పుడే రాజ్యాంగ విలువలను కాపాడిన వారమవుతామని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుదర్శన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచుకొని, రాజ్యాంగం ఆదర్శాలను, ఆశయాలను కాపాడే వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పోటీల విజేతలు వీరేభారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు మెమెంటోలు, లా బుక్స్, ప్రశంసా పత్రాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. వక్తృత్వ పోటీలో "లింగ న్యాయం, న్యాయపరమైన క్రియాశీలత" అనే అంశంపై నిర్వహించిన పోటీలో పి.శృతి మొదటి స్థానంలో, చాందిని రెండవ స్థానంలో ఆర్.తేజస్వి మూడవ స్థానంలో నిలిచారు. "డిజిటల్ యుగంలో భారతదేశంలో గోప్యతా హక్కు" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో తౌరయ్య రాయన్ మొదటి స్థానంలో, పి.శ్రుతి రెండవ స్థానంలో, వి.శ్రీవల్లి ఆండాళ్ మూడవ స్థానంలో నిలిచారు. వి.చందనకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. అదేవిధంగా మూట్ కోర్ట్ పోటీలో 13 జట్లు పాల్గొనగా, మొదటి బహుమతిని ఆదర్శ లా కాలేజీకి చెందిన ఎ.సుధీర్, ఎం.సతీష్, బి.రంజిత్ లకు లభించింది. రెండవ స్థానంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా కళాశాలకు చెందిన ఎన్.శివ, బి.కావ్య, జైనాబ్ ఫాతిమా, మూడవ స్థానంలో వి.శ్రీవల్లి ఆండాళ్, పి.శృతి, బి.వర్ష విజేతలలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, కే.ఎస్.ఎం వ్యవస్థాపకులు కే.పీ.ఈశ్వర్ నాథ్, యూనివర్సిటీ అకడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోల శంకర్, న్యాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ టి.సి.సుజాత, డాక్టర్ ఎస్.పద్మజ, కె.హరి ప్రసాద్, డాక్టర్ వై.ప్రభాకర్, డాక్టర్ జి.వేదశ్రీ, డాక్టర్ ఆర్.లక్ష్మణ్, డాక్టర్ చల్లా శ్రీనివాస్, డాక్టర్ మధు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేయూ నుంచి స్వాతికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్.ఆర్.ఎం (మానవ వనరుల నిర్వహణ) విభాగం పరిశోధకురాలు ఎస్.స్వాతికి డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. డాక్టర్ ఎస్.స్వాతి తన పరిశోధనను "స్టేటస్ ఆఫ్ ఉమెన్స్ సానిటరీ వర్కర్స్ ఇన్ మున్సిపల్ కార్పొరేషన్: ఎ స్టడీ ఆఫ్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్" (గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మహిళా పారిశుద్ధ్య కార్మికుల స్థితిగతులపై ఒక అధ్యయనం) అనే కీలక అంశంపై పూర్తి చేశారు. ఆమె ఈ పరిశోధనను విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటక్షాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ ఎస్.స్వాతిని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# పని ప్రదేశాలలో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

## డాక్టర్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి ఉద్దేశించిన 'పోష్ చట్టం 2013'పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రముఖ సోషల్ యాక్టివిస్ట్, పోష్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారి కార్యాలయంలో గురువారం అంతర్గత ఫిర్యాదు కమిటీ–పోష్ కన్వర్జెన్సీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. చట్టాల గురించి అవగాహన ఉన్నప్పుడే వాటిని సరిగా వినియోగించుకోగలుగుతారని అన్నారు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులు, నిరాదరణ, నిషేధం, పరిహారం కోసం ఈ చట్టం రూపొందించబడిందని తెలిపారు. ఈ చట్టంపై అవగాహన కలిగి ఉంటే, ఉద్యోగాలు చేసే ప్రదేశాలలో మహిళలు తమను తాము సమస్యలు వస్తే ఎలా రక్షించుకోవాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అర్థం చేసుకోగలుగుతారని, ధైర్యంగా ఎదుర్కొనగలుగుతారని అన్నారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలు ఫిర్యాదు చేస్తే, ఈ చట్టం ప్రకారం వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. మహిళలు ఏదైనా వేధింపులకు గురైనప్పుడు సైలెంట్‌గా ఉండకుండా, ధైర్యంగా సమాధానం చెప్పి ఎదుర్కొనే స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం పోష్ కమిటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు ఇంటర్నల్ కమిటీ సభ్యులు అనుమల శ్రీనివాస్, హిమవర్షిని, సుజాత, భానుమతి, నాగరాజు, శ్రీహరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలపడాలి

## ◆ కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు బ్యాంకులిస్తున్న రుణాలను సరియైన విధంగా సద్వినియోగం చేసుకున్నట్లయితే, వారి జీవన విధానం సాఫీగా, సుఖంగా సాగుతుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం సీఆర్‌సీ భవన్‌లో సరోజినీ దేవి ఫస్ట్ తులసి మహిళా సమైక్యల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ మరుపల్ల రవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి సమాజంలో మహిళలకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని, మహిళలు ఆర్థికంగా బలపడడానికి బ్యాంకులు ఎటువంటి షరతులు లేకుండా నమ్మకంతో రుణాలు ఇస్తున్నాయని కార్పొరేటర్ రవి తెలిపారు. అందువల్ల, రుణం పొందిన గ్రూపు సభ్యులు ప్రతినెల క్రమం తప్పకుండా కిస్తీ రూపంలో తిరిగి చెల్లించాలని ఆయన కోరారు. డివిజన్‌లో చిరు వ్యాపారం చేసుకుంటున్న వారు ఎవరైనా ఈ రుణ సదుపాయం పొందవచ్చని సూచించారు. బ్యాంకులో జీవిత బీమా చెల్లించినట్లయితే, అటువంటి వారికి ఏమైనా రిస్క్ కలిగినచో బ్యాంకుల ద్వారా ఇన్సూరెన్స్ (బీమా) పొందవచ్చు అన్నారు. నేటి రోజులలో అనేక ఆర్థిక మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఎవరడిగినా, ముఖ్యంగా ఫోన్ కాల్స్ ద్వారా, తమ ఓటీపీ నంబర్‌లను చెప్పవద్దని మహిళా సభ్యులకు సూచించారు. జనరల్ బాడీ సమావేశంలో 1/4/2024 నుంచి 31/3/2025 వరకు జరిగిన ఆదాయం, వ్యయాల వివరాలను పరిశీలించారు. అధ్యక్షురాలు వార్షిక నివేదికను చదివి వినిపించగా, పొదుపు గ్రూపు సభ్యులు చప్పట్లతో ఆ నివేదికను ఆమోదించారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో సీవో సునీత, పట్టణ సమైక్య ఆర్పీ రేణుక, ఆర్పీలు డి.శ్రీలత, కే.రాధిక, సరోజన దేవి ఫస్ట్ సమైక్య ఓబీ మెంబర్లు కృష్ణవేణి, వీణ, హైమావతి, కళావతి, రాధిక, తులసి సమాఖ్య ఓబీ మెంబర్లు కే.హేమలత, జి.సంధ్య, ఎస్.కరుణ, ఎం.స్వరూప, ఏ.కోమల, ఆర్పీలు ఎం.మాధవి, ఎల్.స్వర్ణలత, పి.కవిత, ఇతర పొదుపు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు డోర్నకల్ విద్యార్థులు



◆ "లో కాస్ట్ పోర్టబుల్ వెంటిలేటర్" ప్రాజెక్ట్ ఎంపిక

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** 2024-25 సంవత్సరానికి గాను ఇన్స్పైర్ అవార్డ్స్ – మనాక్ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో డోర్నకల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశాన్ని అందుకున్నారు. ఈ నెల 25, 26 తేదీలలో మహబూబాబాద్ జిల్లాలోని టీజీ ఎంఎస్ పాఠశాలలో జరిగిన ఇన్స్పైర్ పోటీలలో డోర్నకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పదవ తరగతి) విద్యార్థులు ఎస్కే జాస్మిన్, గురు చరణ్, గిరిధర్ లు పాల్గొన్నారు. ఈ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ పేరు "లో కాస్ట్ పోర్టబుల్ వెంటిలేటర్ ఫర్ రూరల్ ఏరియాస్" (గ్రామీణ ప్రాంతాల కోసం తక్కువ ధరలో తయారు చేయగల పోర్టబుల్ వెంటిలేటర్). ఈ ప్రాజెక్ట్ ఇన్స్పైర్ మనాక్ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని గెలుపొందింది. అదే ప్రాజెక్ట్ ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ అవార్డు ప్రదర్శనకు ఎంపిక కావడంతో విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించడానికి సిద్ధమయ్యారు. వీరికి పాఠశాల బయోసైన్స్ టీచర్ వసంత రాణి గైడ్ టీచర్‌గా వ్యవహరించి, ప్రాజెక్టు రూపకల్పనలో సహకారం అందించారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు అమీన, అనిత, సమిత, మంజులత, రమేష్, సాహెబ్ అలీ, వెంకటేశ్వర్లు, శంకర్ అప్పరెడ్డి లు అభినందనలు తెలియజేశారు.

# ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎడ్యుక్వెస్ట్ టాక్ పోటీలు




**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను మరియు ప్రజా ప్రసంగ సామర్థ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో, జీహెచ్ఎస్ శంభునిపేటలో మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎడ్యుక్వెస్ట్ టాక్ పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను టీజీఎస్సీఈఆర్టీ, భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ సహకారంతో ఈఎల్‌టీఏ తెలంగాణ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శారదాబాయి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి పోటీలను తమ నైపుణ్యాలు, జ్ఞానం, ముఖ్యంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈఎల్‌టీఏ తెలంగాణ అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రెండు విభాగాల్లో (ప్రభుత్వ & స్థానిక సంస్థల పాఠశాలలు; మోడల్ స్కూళ్లు & కేజీబీవీలు) ఈ పోటీలను ఈఎల్‌టీఏ నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి విజేతలు డిసెంబర్ మూడవ వారంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా అభ్యాసాన్ని, ప్రజా ప్రసంగ నైపుణ్యాలను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన లక్ష్యమని వివరించారు. ఎడ్యుక్వెస్ట్ టాక్‌లో సీనియర్స్ విభాగంలో సదస్య (జడ్పీహెచ్ఎస్ స్థంభంపల్లి), జూనియర్స్ విభాగంలో సహస్ర (జడ్పీహెచ్ఎస్ మామునూర్ క్యాంప్) విజేతలయ్యారు. ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో సీనియర్స్ విభాగంలో వర్షిత (జడ్పీహెచ్ఎస్ స్థంభంపల్లి), జూనియర్స్ విభాగంలో రిషికేశ్ (జీహెచ్ఎస్ కరీమాబాద్) మొదటి స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, మణిమాల, పాపిరెడ్డి తదితరులు కీలక పాత్ర పోషించారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



● సివిల్ సప్లై డీఎం మహేందర్ ఆదేశం

**వరంగల్ వాయిస్, పరకాల :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ (డీఎం) మహేందర్ అధికారులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారం రోజుల్లోగా కొనుగోలు పూర్తిచేసి, చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం పరకాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎం మహేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ధాన్యం సేకరణ వివరాలను ఆయన పరిశీలించారు. అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం, జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఆయన తెలిపారు. అయితే, రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున, మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, గోదాములకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కొనుగోలు కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డీఎం మహేందర్ కోరారు. ముఖ్యంగా, ధాన్యంలో తేమశాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. తాలు, మట్టి లేకుండా శుభ్రం చేసిన ధాన్యానికి తక్షణమే కొనుగోలు ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, సంచుల (బస్తాలు) కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు డీఎం మహేందర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పరకాల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి, ఏఓ శ్రీనివాస్, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కమలాపూర్ మండలంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గం ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. కమలాపూర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ నాయకులు మామిడాల అశోక్ తన అనుచరులు 50 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనిగరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండి గణేష్ ముదిరాజ్ తన అనుచరులు 50 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మామిడాల అశోక్, బండి గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులను గెలిపించడానికి సర్వశక్తులా కృషి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రవీందర్, బాలసాని రమేష్ గౌడ్, తడక శ్రీకాంత్, చెరిపెల్లి రామచంద్రం, మౌటం కుమారస్వామి, మాట్ల రమేష్, బొల్లం రాజిరెడ్డి, పోడేటి భిక్షపతి, విష్ణుదాసు వంశీధర్ రావు, కొండ రమేష్, ఆకినపల్లి భిక్షపతి, పుల్ల శోభన్, గడల కొమురెల్లి, పూజారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో జనవరి 25న నిర్వహించనున్న స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను గురువారం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు. కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య బి.సురేష్ లాల్ ఈ పోస్టర్‌ను తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయంలోని అర్థశాస్త్ర విభాగంలో జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య సురేష్ లాల్ మాట్లాడుతూ తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించాలనే సంకల్పం గొప్పదని కొనియాడారు. సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఈ సందర్భంగా సంస్థ బాధ్యులు ఆచార్య సురేష్ లాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, వేముల తిరుపతి రెడ్డి, జోనగోని యాదగిరి గౌడ్, సుద్దాల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ అస్లాంకు న్యాయ సేవా రత్న అవార్డు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా, వరంగల్ నగర రంగసాయిపేట ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది మహమ్మద్ అస్లాంకు "న్యాయ సేవా రత్న" అవార్డును ప్రదానం చేశారు. మహమ్మద్ అస్లాం న్యాయ సేవారంగంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, గ్రంథాలయ శాఖ చైర్మన్ రియాజ్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్, జస్టిస్ మురళీకృష్ణ అవార్డును ప్రధానం చేశారు. మహమ్మద్ అస్లాంకు అవార్డు లభించడం పట్ల స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనా పూర్ణచందర్, కాంగ్రెస్ నాయకులు బోలు గుడ్డు సారయ్య, కెడల పద్మ జనార్ధన్, మంతిని సునీత, సయ్యద్ బషీర్, విలాసాగరం శ్రీనివాస్, చిన్న మునుకుంట్ల చంద్రమౌళి, ఏలుగు సందేశం, వనం వేణు, అనిల్ కుమార్ అభినందనలు తెలిపారు.

# హసన్ పర్తిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యాంపు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసెక్టమీ పక్షోత్సవాలలో భాగంగా, హసన్‌పర్తిలో గురువారం పురుషులకు ప్రత్యేక కుటుంబ నియంత్రణ ఆపరేషన్ శిబిరం నిర్వహించారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 4 వరకు పురుషులకు కోత, కుట్టు లేని ఎన్.ఎస్.వి. (నాన్ స్కాల్ పెల్ వెసెక్టమీ) ఆపరేషన్ పట్ల అవగాహన కల్పించడంతో పాటు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ.అప్పయ్య ఆదేశాల మేరకు హసన్‌పర్తి ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ఎస్ వీ ఆపరేషన్ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 21 మంది పురుషులకు ఎన్ ఎస్ వీ ఆపరేషన్ చేసినట్లు ఎన్ ఎస్ వీ సర్జన్ డాక్టర్ కృష్ణారావు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ శాశ్వత పద్ధతితో పాటు, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన అంతర ఇంజక్షన్, కాపర్‌టీ, నోటి మాత్రలు, నిరోధ్ గురించి కూడా అర్హులైన దంపతులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, స్టాటిస్టికల్ అధికారి జి.ప్రసన్నకుమార్, హెల్త్ అసిస్టెంట్స్ సంతోష్ కుమార్, ఇంద్రారెడ్డి, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్నేని రవీందర్ రావు జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టీజీ క్యాబ్), డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పుట్టినరోజు వేడుకలు గురువారం నాడు హనుమకొండలోని డీసీసీబీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బ్యాంకు ఉద్యోగులందరూ కలిసి చైర్మన్ జన్మదిన వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తులు చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయనతో కేక్ కట్ చేయించారు. తన పుట్టినరోజు వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించినందుకు చైర్మన్ రవీందర్ రావు ఉద్యోగులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎండీ వజీర్ సుల్తాన్, జీఎం ఉషా శ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎంలు గొట్టం స్రవంతి, మధు, కృష్ణ మోహన్, గంప స్రవంతి, యూనియన్ నాయకులు, ఇతర బ్యాంకు ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ హాస్టల్ సందర్శన

**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖకు చెందిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని విముక్త చిరుతలు పార్టీ (వీసీకే రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ గురువారం సందర్శించారు. ఆయన ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంబాల అనిల్ కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ...చలికాలంలో విద్యార్థులకు రావలసిన స్వెటర్లు, దుప్పట్లు (చెద్దర్లు), రగ్గులు అందాయా అని అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడాల్సిన బాధ్యత కూడా ఉందని గుర్తుచేశారు. హాస్టల్ సమస్యలు, విద్యార్థుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలంటే, హాస్టల్‌లో ఉన్న తమ హక్కులను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. వీసీకే విద్యార్థి విభాగం కమిటీ ఎన్నికవిద్యార్థులతో మాట్లాడిన అనంతరం, మొగుళ్లపల్లి ఎస్సీ హాస్టల్లో వీసీకే విద్యార్థి విభాగం కమిటీని ఏర్పాటు చేశారు. పదవిపేరుహాస్టల్ ప్రెసిడెంట్ గా బొజ్జపెల్లి అరవింద్ వైస్ ప్రెసిడెంట్ మేకల అభిరామ్, ప్రధాన కార్యదర్శి కొయ్యడ పవణ్ కమిటీ సభ్యులు పోగు దిలీప్, సుంకిత రాహుల్, నిఖిల్, శివకుమార్, యశ్వంత్, అజిత్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులతో పాటు వీసీకే యూత్ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడాభివృద్ధికి మార్గం సుగమం



◆ హనుమకొండ బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు అధికారిక గుర్తింపు

**వరంగల్ వాయిస్,హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌లో హనుమకొండ బాస్కెట్‌బాల్ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు అధికారికంగా చోటు దక్కింది. తాజాగా రాష్ట్ర అసోసియేషన్ విడుదల చేసిన అనుబంధ సంఘాల జాబితాలో హనుమకొండ జిల్లా అసోసియేషన్‌కు చోటు లభించడంపై జిల్లాలోని క్రీడాభిమానులు, అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా అధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె. సాయితేజ మాట్లాడుతూ అధికారిక గుర్తింపు లభించడంతో జిల్లాలో క్రీడాభివృద్ధికి, మరింత మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడానికి అవకాశాలు మెరుగుపడతాయని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేషన్ గుర్తింపు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ సీనియర్స్ చాంపియన్‌షిప్ –2025 కోసం జిల్లా సెలెక్షన్స్ విజయవంతంగా ముగిసినట్లు హనుమకొండ అసోసియేషన్ ప్రకటించింది. పురుషుల జట్టుకు సాధిక్, తాటి రాహుల్, ఆకుల సిద్ధార్థ్, రామకృష్ణ రెడ్డి, వినయ్ మనుపాటి, దుస్సా విఘ్నేశ్వర్, సంతోష్ కుమార్, గ్రీష్మంత్, వినీత్, పైడాకుల రాహుల్, సంజయ్, హృదై, శశిప్రీతమ్, సంపత్ కుమార్, రాహుల్ గంజి, మహిళా జట్టుకు పి. శిరిషా, సరస్వతి, శ్రీజ, లక్ష్మి, కీర్తన, అమృత ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు గుర్తింపు లభించిన సందర్భంగా, ఎంపికైన క్రీడాకారులందరినీ అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.



# గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా పనిచేయాలి



• పరిశీలకురాలు బాల మాయ దేవి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా జరిగేలా అధికారులు అంకితభావంతో పని చేయాలని ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయ దేవి అధికారులకు సూచించారు. గురువారం సాధారణ పరిశీలకురాలు బాల మాయ దేవి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వ్యయ పరిశీలకులు సునాయన చౌహాన్ లతో కలిసి నామినేషన్లకు సంబంధించిన కేంద్రాలను పరిశీలించారు. వారు ముఖ్యంగా వర్ధన్నపేట మండలం పరిధిలోని కట్ర్యాల, కడారి గూడెం, ఇల్లంద, రామోజీ కుమ్మరిగూడెం తండ, రాయపర్తి మండలం పరిధిలోని రాయపర్తి, జేతురాం తండ, రామన్న గూడెం, గణేష్ తండ, మహబూబ్ నగర్, అలాగే పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్, పెద్ద తండ, దూప తండ, రావూర్, మోత్యతండ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రిటర్నింగ్ అధికారుల ట్రైనింగ్, నిర్వహణ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంపులను కూడా వారు పరిశీలించారు. అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జడ్పీ సీఈవో ఇంచార్జ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, ఆర్డీవో సుమ, జీఎం ఇండస్ట్రియల్ అధికారి నరసింహమూర్తితో పాటు సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీవోలు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలకు పెట్టింది పేరు బీఆర్ఎస్

● కాంగ్రెస్ నేత శశిభూషణ్ కాచే

**వరంగల్ వాయిస్, మంథని :** అసత్యపు ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులే మారుపేరని టీపీసీసీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది శశిభూషణ్ కాచే మండిపడ్డారు. గురువారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై నాణ్యత లేకుండా నిర్మించిన చెక్ డ్యాంలు కూలిపోవడంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గుంపుల వద్ద మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యామ్ నాణ్యత లోపంతో కూలిపోతే, దానిని బాంబులతో పేల్చివేశారని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమని శశిభూషణ్ కాచే ఎద్దేవా చేశారు. అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని వారికి సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయినప్పుడు, దానిని బాంబులతో పేల్చారని అప్పుడు అసత్యపు ఆరోపణలు చేస్తూ తెలంగాణ, మహారాష్ట్ర పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు ఇప్పించారని ఆయన గుర్తు చేశారు. మానేరుపై దాదాపు రూ. 300 కోట్లతో నిర్మించిన చెక్ డ్యాంలు గాలికి కూలిపోయి, వరదల్లో కొట్టుకుపోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో సంఘటన జరిగితే 'కుంగిపోవడం' అని, ప్రస్తుత ప్రభుత్వంలో అదే జరిగితే 'పేల్చివేయడం' అనడం ఎంతవరకు సమంజసమని ఆయన బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. మాజీ




నీటిపారుదల శాఖ మంత్రి స్వీయ పర్యవేక్షణలో నిర్మించిన కాళేశ్వరం బ్యారేజ్, చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు నాసిరకంతో నిర్మించి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ కట్టడాలపై విజిలెన్స్ అధికారులు తక్షణమే విచారణ జరిపి, గత ప్రభుత్వ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని శశిభూషణ్ కాచే కోరారు. గత ప్రభుత్వ అవినీతిపైన ప్రస్తుత రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, ఆర్టీఏ సభ్యుడు సురేష్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు శంకర్, పర్షవన మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నా కన్ను.. నా ముక్కు.. నా ఇష్టం

## ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్ లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్ కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్ ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్ పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్.శ్రుతిహాసన్ అందం పై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడిరది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.



# వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి–సోదరి–కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. ‘దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. ‘చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. ‘నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు.







# ‘ఛాంపియన్’ భారీ అంచనాలు

హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘ఛాంపియన్’ నుంచి ఫస్ట్ సింగిల్ ‘గిరా గిరా’ విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్ బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ ‘తాళ్లపూడి చంద్రకళ’గా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . ‘పెళ్లిసందడి’తో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ‘ ఛాంపియన్ ’ భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్ బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ‘ఛాంపియన్’ చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. ‘గిర గిర గిరగింగిరా గిరే’ అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఈ సాంగ్‌కు స్వరాలు సమకూర్చగా, రామ్ మిరియాల తనదైన భిన్నమైన ఫోక్ స్టైల్‌తో పాటకు ప్రాణం పోశాడు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామీణ వాతావరణాన్ని అచ్చుగుద్దినట్టు ప్రతిబింబించింది.

# ఎట్టకేలకు హిట్ కొట్టిన రామ్

రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆంధ్రకింగ్ తాలూకా.. ఈ సినిమా భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ పి. మహేశ్ బాబు ఈ సినిమాను తెరకెక్కించాడు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాడు. అలాగే రావు రమేష్, మురళీ శర్మ, రాజీవ్ కనకాలు, తులసి, సింధు తులానీ, రాహుల్ రామకృష్ణ, సత్య, వీటీవీ గణేష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇక ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు సినిమా పై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇక సినిమా బాగుందని.. చాలా కాలం తర్వాత రామ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు అంటున్నారు. రామ్ నటన సినిమాకే హైలైట్ అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఎట్టకేలకు రామ్ హిట్ కొట్టాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు ప్రేక్షకులు. మొత్తానికి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్ లోకి వచ్చాడు రామ్ పోతినేని.





# నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- పలు కేంద్రాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ల స్వీకరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, దామెర, గోపాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో క్లస్టర్ల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఎల్కతుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం( క్లస్టర్) నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఎల్కతుర్తి, బావుపేట, ఆరెపల్లి గ్రామాలు, దామెర గ్రామపంచాయతీ కార్యాలయం క్లస్టర్ నామినేషనన్ల స్వీకరణ కేంద్రం వద్ద దామెర, చింతలపల్లి, ఇందిరా నగర్ గ్రామాలు, గోపాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం నామినేషన్ స్వీకరణ కేంద్రం వద్ద గోపాల్ పూర్, కోతుల నడుమ, శాంతి నగర్, వల్బాపూర్ గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఎలక్షన్ నోటీస్, ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్క్ లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ఆత్మారాం, జడ్పీ సీఈఓ రవి, ఎల్కతుర్తి తహసిల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీఓ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నామినేషన్లకు మూడు రోజులు..

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్, వార్డు స్థానాలకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈనెల 29న నామినేషన్ల దాఖలుకు ఆఖరి గడువు. 30వ తేదీన నామినేషన్ల స్క్రూటిని, డిసెంబర్ 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, ఇదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా, డిసెంబర్ 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు, అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు, విజేతల పేర్లు ప్రకటించనున్నారు.

### 210 గ్రామ పంచాయతీలు..

జిల్లాలో 210 గ్రామపంచాయతీలు, 1986 వార్డు స్థానాలకు మూడు విడతల్లో నిర్వహించనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ స్నేహ శబరిష్ పేర్కొన్నారు. మొదటి విడత మండలాల్లో క్లస్టర్ల వారిగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడత ఎన్నికలు జరగనున్న భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ మండలాల్లో 24 క్లస్టర్లు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 74 క్లస్టర్లు ఉన్నట్లు చెప్పారు. క్లస్టర్ల వారీగా నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఎస్ టీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్న భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఎలాంటి రాజకీయ పార్టీల హోర్డింగ్ లు, బ్యానర్లు, గోడ ప్రతులు, రాతలు ఉండకూడదని, ప్రైవేట్ స్థలాల్లో ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు ఉండవన్నారు. ఎన్నికల రోజునే వార్డు మెంబర్, సర్పంచుల ఓట్ల కౌంటింగ్ ఉంటుందని, కౌంటింగ్ తదుపరి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఉప సర్పంచ్ ఎన్నిక తర్వాతి రోజు ఉంటుందన్నారు. జిల్లాలో 52 గ్రామపంచాయతీలు సమస్యాత్మక జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అదనంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మైక్రో అబ్జర్వర్లను కూడా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ ను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.



# కమలాపూర్ లో తొలి నామినేషన్

□ బీజేపీ అభ్యర్థి పబ్బు సతీష్ దాఖలు

జిల్లాలో మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి సీనియర్ జర్నలిస్ట్, బీజేపీ నాయకులు పబ్బు సతీష్ తొలి నామినేషన్ ను దాఖలు చేవారు. సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పబ్బు సతీష్‌తో పాటు బీజేపీ నేతలు కొండమీది రవి, మౌటం సంపత్ పాల్గొన్నారు. పబ్బు సతీష్ విజయం కోసం తమ మద్దతుదారులతో కలిసి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. **-వరంగల్ వాయిస్, కమలాపూర్**

# ఎన్నికల సమాచారానికి Te-Poll యాప్

- ప్రతి ఓటరు డౌన్ లోడ్ చేసుకోవాలి
- కలెక్టర్ సత్య శారద




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సౌకర్యవంతంగా సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన Te–Poll మొబైల్ యాప్ ను ప్రతి ఓటరు డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటర్లు పోలింగ్ కేంద్ర వివరాలు, ఓటర్ స్లిప్పు నమోదు సమాచారం సులభంగా తెలుసుకో గలుగుతారని పేర్కొన్నారు. జిల్లాలో ఓటరు అవగాహన, ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియాగించుకోవాలన్నారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గూగుల్ ప్లే స్టోర్ లో యాప్ అందుబాటులో ఉందన్నారు. గూగుల్ ప్లే స్టోర్ లింక్ https://play.google.com/store/apps/de–tails?id=com.cgg.gov.in.te_poll_telugu ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





# పోతన ఆదర్శప్రాయుడు

- ప్రజల హృదయాల్లో నిలిచిన భక్త కవి
- ఏవీవీలో ఘనంగా పోతన జయంతి ఉత్సవాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేటి యువతకు బమ్మెర పోతన ఆదర్శప్రాయుడని ఏవీవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.భుజేందర్ రెడ్డి అన్నారు. ఏవీవీ జూనియర్ కళాశాలలో గురువారం పోతన జయంతి, వ్యవస్థాపక జన్మదినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వమించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ ఎ.భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే భక్తి, జ్ఞానమును పెంపొందించుకొని సమాజంలో ఉన్నత స్థానంలో నిలపడాలన్నారు. ఏవీవీలో గత 60 సంవత్సరాలుగా పోతన జయంతి వేడుకలు నిర్వహిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఆచార్య ఎస్ఎస్ వీఎన్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి పోతన కవితా వైభవంను వీనులవిందుగా వివరించారు. ఆ మహానుభావుడు ఇక్కడ జన్మించడం ఓరుగల్లు వాసుల అదృష్టమన్నారు. సనాతన ధర్మం విలువలను పోతన భాగవతం మనకు చక్కగా అందజేస్తుందన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇ.సత్యనారాయణ పోతన జయంతి ప్రాశస్త్యంను తెలియజేశారు. పోతన జయంతి వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. తెలుగు అధ్యాపకులు గందె శ్రీనివాస్ మాట్లాడుతూ పోతన జయంతి సందర్భంగా త్రినగరిలోని 68 పాఠశాలల నుంచి 1,600 మంది విద్యార్థులు పోతన భాగవత పద్య పటన పోటీల్లో పాల్గొని తరించారన్నారు. పోతన భాగవతం విద్యార్థుల జీవితాలను ఎంతగానో తీర్చిదిద్దుతుందన్నారు. బాల్యంలోనే భక్తిరస ప్రధానమైన పోతన భాగవత పద్యాలు విద్యార్థుల నాలుకల మీద నిలవడం మనందరి అదృష్టం అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్ కుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు బరుపాటి గోపి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు, పుర ప్రముఖులు, అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థి బృందం పాల్గొని విజయవంతం చేశారు. ఇటీవల జరిగిన భాగవత పద్య పటన వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో విజేతలైన వివిధ పాఠశాలల కళాశాలల విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com